క్లుప్తంగా

2న వేలం పాట

నందిగామ టౌన్: మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసివున్న సత్యమ్మ అమ్మవారి ఆలయంలో పలు హక్కులకు టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈఓ హరిగోపీనాథ్ తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కొబ్బరికాయలు, నిమ్మకాయలు తదితర పూజా సామగ్రి విక్రయించుకునేందుకు, అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్లు అమ్ముకునేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వచ్చేనెల రెండవ తేదీన ఉదయం 11 గంటలకు జరిగే వేలం పాటలో ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని కోరారు.

కొనసాగుతున్న పవిత్రోత్సవాలు



నందిగామ టౌన్: పట్టణంలో వేంచేసియున్న సీతారామాంజనేయ స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా మంగళవారం విష్వక్సేనారాధన, పుణ్యాహవచన, అగ్నిప్రణయనము, కుంభ ఆరాధనలతోపాటు స్నపన తిరుమంజనం, పవిత్ర సమర్పణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహాశాంతి హోమం, స్వామివారి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ ఫణికుమార్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అనిగండ్లపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం-3లో హెల్పర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ లక్ష్మీభార్గవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెల్పర్ పోస్టుకు ఓసీ సామాజిక వర్గానికి చెందిన స్థానిక వివాహిత మహిళలు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండాలన్నారు. దరఖాస్తులను నవంబర్ 5వ తేదీ సాయంత్రం లోపు అందజేయాలని సూచించారు.

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం



అనిగండ్లపాడు, కొణకంచి(పెనుగంచిప్రోలు): ఆయుర్వేద వైద్యంతో అనేక దీర్ఘకాలిక వ్యాధులు దూరం అవుతాయని వైద్యాధికారి వై. రత్న ప్రియదర్శిని అన్నారు. ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని మంగళవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని స్థానిక ఆయుర్వేద ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. అలాగే కొణకంచి గ్రామంలో వైద్యాధికారి కె. వాణి ఆధ్వర్యంలో ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోనెల దేవి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో 12 దరఖాస్తులు

బలుసుపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని సచివాలయంలో మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్వో లచ్చా మాట్లాడుతూ భూముల గట్లు, పాస్ పుస్తకాల సమస్యలపై రైతులు అర్జీలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూముల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు 12 దరఖాస్తులు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాశరావు, కార్యదర్శి చంద్రశేఖర్, గ్రామ సర్వేయర్‌లు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులను విధుల్లోకి తీసుకోవాలి



నందిగామ టౌన్: రాజకీయ కక్ష్యతో తొలగించిన మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఎంఈఓ పద్మావతికి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 23 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులను అకారణంగా తొలగించారన్నారు. మండలంలోని రాఘవాపురం, లింగాలపాడు, కేతవీరునిపాడు, అంబారుపేట, పెద్దవరం గ్రామాలకు చెందిన నిర్వాహకులను రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల ఏసోబు, గోపీ నాయక్, హుసేన్, నాగేంద్రం, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

కోతుల ఫీట్లు.. రైతుల పాట్లు

- పంటలను నాశనం చేస్తున్న కోతులు
- నష్టపోతున్న రైతన్నలు



పత్తి పంట చుట్టూ ఏర్పాటు చేసిన తెరలు



పొలాల వైపు గుంపులుగా వెళ్తున్న కోతులు

పెనుగంచిప్రోలు: పంటలను కోతులు నాశనం చేస్తున్నాయి. గతంలో రకరకాల తెగుళ్ల, ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతులు పంటలను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడేవారు. అయితే ఇటీవల కోతుల బెడద రైతులను మరింతగా బాధిస్తోంది. కోతులు వందల సంఖ్యలో పంటలపై దాడులు చేస్తూ రైతుల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా అడవులు తగ్గిపోవడంతో వనాల్లో ఉండాల్సిన కోతులు జనాల్లోకి వస్తున్నాయి. నియోజకవర్గంలో ఏ గ్రామంలో చూసినా కోతులు వందల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి.

పంట పొలాలపై దాడి

కోతుల నుంచి తమ పంటలను కాపాడుకునేందుకు రైతులు వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. ప్రస్తుతం కూరగాయలు, పత్తి రైతులు కోతులతో నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా పత్తి కాయలను కోతులు కొరికి పడేయడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు అనేక మార్గాలు అన్వేషిస్తున్నారు. కొందరు రైతులు పొలం చుట్టూ ఫెన్సింగ్ లాగా తెరలు ఏర్పాటు చేస్తున్నారు. కొందరు నెలకు రూ. 13 నుంచి రూ. 15 వేలు ఇచ్చి కాపలాదారులను ఏర్పాటు చేసుకుంటున్నారు. అయినా గుంపులుగా వచ్చే కోతులను తట్టుకోలేక పోతున్నామని రైతులు వాపోతున్నారు.

కోతుల బెడద తట్టుకోలేకపోతున్నాం



కోతుల బెడద తట్టుకోలేకపోతున్నాం. పంటలను కాపాడుకోవడానికి అనేక బాధలు పడాల్సి వస్తోంది. పొలం చుట్టూ తెరలు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దీనికి అదనంగా రూ. 10 వేల వరకు ఖర్చు అయింది. తెరలు ఏర్పాటు చేసినా ఒక్కోసారి కోతులు వస్తున్నాయి.

–చుంచు బెనర్జీ, రైతు, పెనుగంచిప్రోలు

రైతులకు నష్టపరిహారం అందించాలి

వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న తన్నీరు, నాయకులు

నందిగామ టౌన్: ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతూ నందిగామ ఆర్డీవో బాలకృష్ణకు మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని కృష్ణానది, మునేరు, పాలేరు, వైరాకట్టలేరు, కూచివాగు ఉధృతికి పంటలు కొట్టుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంట నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదని మరలా సర్వే చేయించి గ్రామ సభల ద్వారా పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించాలని సూచించారు. అంతే కాకుండా పొలాల్లో రైతులు ఇసుక మేట తొలగించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు పరిహారం, మేట తొలగించి సాగు చేసుకునేలా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కొమ్మినేని రవిశంకర్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో ధన్వంతరి జయంతి సందర్భంగా మంగళవారం పరిటాల ఆయుర్వేద ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు తెలిపారు. ముందుగా ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఆయుర్వేద మందులు వాడాలన్నారు. అనంతరం 89మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు జె. పద్మజ, యోగా గురువు ఎం. మాణిక్యాలరావు, రాజశేఖర్, యోగా ఇన్‌స్ట్రక్టర్ జి. దీప్తి, ఉయ్యూరు శ్రీనివాసరావు, మాజీ గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్‌లు స్వాధీనం



సాక్షి ఎఫెక్ట్

పెనుగంచిప్రోలు: మండలంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అర్జున్ తెలిపారు. సాక్షి దినపత్రికలో ఈనెల 28న 'ఇసుక తోడేస్తున్నారు' అనే శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని తోటచర్ల, సుబ్బాయిగూడెం గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉన్న ఇసుకను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుక సుమారుగా 60 టన్నులు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఇసుక అక్రమ రవాణా, డంప్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి

ఆగిరిపల్లి: లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ శుభశేఖర్ కథనం మేరకు.. ఎస్‌ఏ పేటలో మూడు నెలల కిందట జామాయిల్ తోటలో కర్రలను లారీలో లోడ్ చేయడానికి బీహార్ నుంచి కురుషు సహాని (25) వచ్చాడు. సోమవారం కర్రలను లోడ్ చేసిన అనంతరం కొంతసేపు విశ్రాంతి తీసుకుందామని లారీ కింద పడుకుని నిద్రపోయాడు. లారీ డ్రైవర్ షేక్ అల్తాఫ్ గమనించకుండా లారీని నడపడంతో లారీ కింద నిద్రిస్తున్న సహానికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

సామాజిక తనిఖీ ప్రజావేదికలో పీడీ రాము



సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

జుజ్జూరు(వీరులపాడు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు అందాయని విచారణ అనంతరం అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని పీడీ రాము పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు జెల్లి ఏసోబు కల్యాణ మండపంలో మంగళవారం ఎంపీపీ కోటేరు లక్ష్మి అధ్యక్షతన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో రూ. 12 కోట్ల విలువ చేసే పనులు జరిగాయన్నారు. పనులకు సంబంధించి ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అవినీతికి పాల్పడినట్లు విచారణలో తేలితే నగదు రికవరీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కాగా మండలంలోని గోకరాజుపల్లి, నందలూరు, తాటిగుమ్మి, జుజ్జూరు, గోకరాజుపల్లి, కొణతాలపల్లి, జగన్నాథపురం, పొన్నవరం, జమ్మవరం గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడినట్లు ఆయా గ్రామాల ప్రజలు ప్రజావేదికలో అధికారులకు ఫిర్యాదులు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతి దేవి, డీపీవో విజయలక్ష్మి, ఎస్ఆర్పీ సూర్యనారాయణ, ఇమ్మానియేలు, నాగిరెడ్డి, రాణా ప్రతాప్ సింగ్, ఏపీవో జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం



కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే సౌమ్య, సభ్యులు

నందిగామ టౌన్: మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో మంగళవారం మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ పట్టణాభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ అజెండాలోని 46 అంశాలను సభ్యులు ఆమోదించారని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ పాకాలపాటి కృష్ణ, కౌన్సిల్ సభ్యులు షేక్ ఖాలిక్, షేక్ యాకుబ్ అలీ, బండారు గంగమ్మ, మందా మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పాలేటి బ్రిడ్జి

- వరద ఉధృతికి తొమ్మిది మీటర్ల మేర ధ్వంసం
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



ఇటీవల వచ్చిన వరదలకు కొట్టుకుపోయిన బ్రిడ్జి

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట–కె.అగ్రహారం పాలేటి బ్రిడ్జి ప్రమాదకరంగా దర్శనమిస్తుండటంతో రాకపోకలు సాగించాలంటే ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. సుమారు 60 ఏళ్ల క్రితం పాలేటిపై నిర్మించిన అరకిలోమీటరు బ్రిడ్జి ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. పాలేటి బ్రిడ్జి మీదుగా అవతలి గ్రామాలైన కె.అగ్రహారం, ముక్త్యాల, విశాఖ స్టీల్‌ప్లాంట్, బూదవాడ గ్రామాల ప్రజలు కాకుండా ఆయా గ్రామాల్లోని సిమెంట్ కర్మాగారాలకు ఎగుమతి, దిగుమతులకు నిత్యం లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతే కాకుండా తెలంగాణా రాష్ట్రానికి వెళ్లాలన్నా కృష్ణానదిపై నిర్మించిన పులిచింతల మార్గం కూడా ఈ బ్రిడ్జిపై నుంచే వెళ్లాల్సి ఉంది. దీంతో బ్రిడ్జి శిథిలావస్థకు చేరుతుండటంతో ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

వరదొస్తే రాకపోకలు బంద్

బ్రిడ్జికి ఎనిమిది కానాలుండటంతో పాటు ఎత్తు కూడా తక్కువగా ఉండటంతో ఎగువన తెలంగాణాలో భారీ వర్షాలు కురిస్తే పాలేరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో బ్రిడ్జిపై వరద నీరు ప్రవహిస్తుండటంతో చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు బంద్ కావాల్సిందే. ఇటీవల వచ్చిన వరదలకు ఐదు రోజుల పాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఇటీవల వరదల సమయంలో ఓ సిమెంట్ కర్మాగారం యాజమాన్యం తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా ప్రస్తుతం అప్రోచ్ రోడ్డు గుంతలమయంగా మారింది.

నూతన బ్రిడ్జి నిర్మాణం కలేనా?

కొత్త బ్రిడ్జి నిర్మాణం కలగానే మిగిలింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసినప్పటికీ ఎన్నికలు రావడంతో కొన్ని అడ్డంకులు ఏర్పడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బ్రిడ్జి నిర్మాణంపై తాత్సారం చేస్తోంది. ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన బ్రిడ్జి నిర్మించాలి



బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం. నిత్యం ఈ బ్రిడ్జిపై వందల సంఖ్యలో వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. నూతన బ్రిడ్జి నిర్మించాలి.

–ఆవుల శ్రీనివాసరావు, సర్పంచ్ కె.అగ్రహారం

ప్రతిపాదనలు పంపాం



పాలేటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 30 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. బ్రిడ్జి ప్రమాదభరితంగా ఉండటంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.

–టి. పరుశురాముడు, ఆర్అండ్‌బీ డీఈ

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను పరామర్శించనున్న జిల్లా నేతలు

నందిగామ టౌన్: వైఎస్సార్ సీపీ జిల్లా కన్వీనర్ దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నేతలు, ఏడు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు మండలంలోని కీసర గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు పరిటాల రామకోటేశ్వరరావును పరామర్శించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు నేతలు వస్తున్నారని చెప్పారు. ఇటీవల కీసర గ్రామంలో వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకుల మధ్య ఘర్షణ జరిగిందన్నారు. ఈ ఘర్షణలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టడమే కాకుండా 27 మందిని నెల రోజుల పాటు రిమాండ్‌లో ఉంచారని గుర్తుచేశారు. రాముతోపాటు రిమాండ్‌లో ఉన్న వారిని పరామర్శించి ధైర్యం చెప్పడం జరుగుతుందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

11 ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



ఇసుక తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్

నందిగామ టౌన్: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఏసీపీ రవికిరణ్ పేర్కొన్నారు. నందిగామ పట్టణ సమీపంలోని మునేటిలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారనే సమాచారంతో మంగళవారం పోలీసులు దాడి చేసి 11 ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక కావాల్సిన వారు నిబంధనల ప్రకారం అనుమతులున్న రీచ్‌ల నుంచి తోలుకోవాలని సూచించారు. ట్రాక్టర్ల నుంచి ఇసుక రవాణా చేస్తూ నిర్మానుష్య ప్రాంతాల్లో డంప్ చేయడం నేరమని తెలిపారు. పట్టుబడిన వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ వైవీఎల్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక డంప్‌ల స్వాధీనం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): అక్రమంగా డంప్ చేసిన రెండు ఇసుక డంప్‌లను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని రెడ్డినాయక్‌తండా గ్రామంలో రెండు ఇసుక డంప్‌లు అక్రమంగా ఉన్నట్లు గ్రామ మహిళా పోలీస్ పార్వతీ సోమవారం అర్ధరాత్రి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. దీంతో సిబ్బందితో వెళ్లి డంప్‌ను స్వాధీనం చేసుకుని రెవెన్యూ శాఖాధికారులకు అప్పగించినట్లు చెప్పారు. డంప్‌ల్లో సుమారు 22 టన్నుల ఇసుక ఉన్నట్లు పేర్కొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ పి. వెంకటేశ్వర్లు

మల్కాపురం(జగ్గయ్యపేట): ఇసుకను అక్రమంగా పక్క రాష్ట్రాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పి. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌లు, యజమానులతో మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీపంలోని మునేటి నుంచి ఇసుకను కొందరు అక్రమంగా తెలంగాణాకు తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. మండల వ్యాప్తంగా అన్నవరం, బూదవాడ గ్రామాల్లోని ట్రాక్టర్ డ్రైవర్‌లకు నోటీసులు జారీ చేసి 25 జేసీబీలను గుర్తించామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముక్త్యాల, బేదవాడ, అన్నవరం, గరికపాడు, మల్కాపురం, గండ్రాయి గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. అంతే కాకుండా స్పెషల్ టీం సిబ్బంది కూడా రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలో ఎనిమిది బైండోవర్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రీచ్ తొలగించాలి



డీటీ భాస్కర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు, నాయకులు

పెనుగంచిప్రోలు: మండలంలోని అనిగండ్లపాడు గ్రామ సరిహద్దులో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను తక్షణం తొలగించాలని ఆ గ్రామానికి చెందిన రైతులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనిగండ్లపాడు గ్రామ సమీపంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయడం వల్ల రైతుల పంట పొలాలు దెబ్బతింటున్నాయన్నారు. మైనింగ్, రెవెన్యూ, జియాలజిస్టులు రైతులకు విషయం చెప్పకుండా ఇసుక డంపింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. అలాగే ఇసుక డంపింగ్ విధానంలో మనుషులతో కాకుండా జేసీబీలతో లోడింగ్ చేయడం వల్ల పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు కోతకు గురై రైతులు పంట నష్టపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీతిరుపతమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ అత్తలూరి అచ్యుతరావు, టీడీపీ నాయకులు పొందూరి శేఖర్, టి. మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో కూటమి ప్రభుత్వం విఫలం

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

కంచికచర్ల: విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపీనాయక్ అన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం విద్యార్థులతో కలిసి ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపీనాయక్ మాట్లాడుతూ విద్యారంగంలోని సమస్యలు తక్షణమే పరిష్కరించాలని లేకపోతే ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. తల్లికి వందనం, విద్యా దీవెన, వసతిదీవెన పథకాలను అమలు చేయాలన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు నేటికి ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు అందించలేకపోయిందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో నాడు–నేడు పథకం ద్వారా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నీ పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఫైనల్ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు మాధవ్, గోపీ, ప్రేమకుమార్, వెంకటేష్, హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాల వద్ద సందడి



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ గ్రౌండ్స్, మార్కెట్ యార్డు, చిల్లకల్లు రోడ్‌లోని శుభమస్తు ఫంక్షన్ హాల్, బలుసుపాడు రోడ్‌లో ఏర్పాటు చేసిన పర్మినెంట్ దీపావళి టపాసుల దుకాణాల వద్ద సందడి నెలకొంది. గతంలో అధికారులు 10 రోజుల పాటు అమ్మకాలకు అనుమతి ఇచ్చేవారు. అయితే ప్రస్తుతం మారిన ప్రభుత్వ నిబంధనలతో నేడు అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అనుమతుల కోసం తిరగాల్సి రావడంతో పండుగకు నాలుగు రోజుల ముందు అనుమతి ఇచ్చారు. పట్టణంలోని బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో 21 దుకాణాలు, మార్కెట్ యార్డులో ఒకటి, చిల్లకల్లు రోడ్‌లోని శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో ఒకటి కలిపి మొత్తం పట్టణంలో 23 షాపులకు అనుమతి ఇచ్చినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ డీటీ మనోహర్ తెలిపారు.